సత్వరమే స్పందించి న్యాయం చేయాలి

ఎస్పీ రాజేశ్‌చంద్ర

భిక్కనూరు, మార్చి 11 : పోలీస్ స్టేషన్‌కు వచ్చి బాధితులు ఇచ్చే ఫిర్యాదులపై సత్వరమే స్పందించి వారికి న్యాయం చేయాలని ఎస్పీ రాజేశ్‌చంద్ర అన్నారు. భిక్కనూరు పోలీస్ స్టేషన్‌ను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని పరిసరాలను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో బాధ్యతగా మెలగాలని సూచించారు. సైబర్ మోసాలబారిన పడకుండా అప్రమత్తం చేయాలని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. స్టేషన్ పరిధిలోని పోలీస్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుకు కృషి చేయాలని ఏఎస్పీ చైతన్యారెడ్డి చెప్పారు. మండల పరిధిలో పెట్రోలింగ్‌ను పెంచి.. దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలను నివారించాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని కేసులు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సీఐ సంపత్ కుమార్, ఎస్సై ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భిక్కనూరు పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ రాజేశ్‌చంద్ర

క్యాంటీన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బీబీపేట్(దోమకొండ), మార్చి 11 : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమీపంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను కామారెడ్డి ఎమ్మెల్యే కాట్టిపల్లి వెంకటరమణారెడ్డి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్డీవో సురేందర్, ఏపీడీ మురళీకృష్ణ, డీపీఎం సుధాకర్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ సంజయ్, ఐకేపీ సిబ్బంది, మండల అధికారులు, నాయకులు, మహిళా సంఘం సభ్యులు తదితరుల పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలి

బాన్సువాడ రూరల్, మార్చి 11 : ఉపాధ్యాయులు తప్పని సరిగా సమయపాలన పాటించాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జిల్లా విద్యాధికారి రాజు అన్నారు. మండలంలోని బోర్లం ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో పాఠ్యపుస్తకాలను చదివించారు. తరచూ పాఠశాలలను తనిఖీ చేయాలని మండల విద్యాధికారి నాగేశ్వర్‌రావుకు సూచించారు. ఆయన వెంట డీఎల్‌పీవో సత్యనారాయణరెడ్డి, ఎంపీడీవో బషీరుద్దీన్, జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ తదితరులు ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ రూరల్, మార్చి 11 : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. బాన్సువాడ మండలం దేశాయిపేట్ గ్రామంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె మంగళవారం పాల్గొని మాట్లాడారు. మహిళలు మగవారికి దీటుగా విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో పోటీ పడాలని సూచించారు. ప్రస్తుతం నర్సింగ్ విద్యకు దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉన్నదని చెప్పారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భూలక్ష్మీ, అధ్యాపకబృంద, విద్యార్థినులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

నస్రుల్లాబాద్ మార్చి 11 : నస్రుల్లాబాద్ మండలంలో సంగెం గ్రామంలో మంగళవారం నెహ్రూ యువకేంద్రం, సేవా సంఘం ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మూడు అంగన్‌వాడీ కేంద్రంల్లోని గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వాణి, యూత్ సభ్యుడు సునీల్ రాథోడ్, ఆయా అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు పాల్గొన్నారు.

నర్సరీ, డంపింగ్ యార్డ్ పరిశీలన

బాన్సువాడ రూరల్, మార్చి 11 : ఉష్ణోగ్రతలు పెరిగిన నేపథ్యంలో పల్లె ప్రకృతి వనం, నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో బషీరుద్దీన్ గ్రామ పంచాయతీ కార్యదర్శి దయానంద్‌కు సూచించారు. మండలంలోని మొగులాన్‌పల్లి తండా గ్రామంలోని నర్సరీ, డంపింగ్‌యార్డును ఆయన పరిశీలించారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి వంద రోజులు పూర్తయ్యేలా పని కల్పించాలన్నారు.

మద్యాన్ని సీజ్ చేసిన పోలీసులు

భిక్కనూరు, మార్చి 11 : అనుమతి లేకుండా అమ్ముతున్న మద్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జంగంపల్లి గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు మంగళవారం దాడి చేసినట్లు చెప్పారు. ఈ దాడుల్లో జంగంపల్లి గ్రామానికి చెందిన నరేశ్‌గౌడ్ ఇంట్లో సోదాలు చేసి 24 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేపట్టాలి

కామారెడ్డి, మార్చి 11 : జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి మాదిగలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టం వచ్చేంత వరకు ఉద్యోగ నియామకాలు నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పద్మారావు, మాదిగ మహిళా విభాగం నాయకురాలు లక్ష్మి, యాదగిరి, సాయిలు, శివరాజు, భాగయ్య తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

భిక్కనూరు, మార్చి 11 : అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తిప్పాపూర్ గ్రామ శివారులో యాదాద్రి భువనగిరి జిల్లా కు చెందిన భూక్యా శ్రీనివాస్ పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు డీటీ కిష్టయ్య పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అతడిని అదుపులోకి తీసుకొని 18 బ్యాగుల్లో ఉన్న నాలుగు క్వింటాళ్ల 83 కిలోల బియ్యాన్ని సీజ్ చేశామని తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సౌత్ క్యాంపస్‌ను సందర్శించిన వీసీ

భిక్కనూరు, మార్చి 11 : సౌత్ క్యాంపస్‌ను తెలంగాణ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ యాదగిరిరావు సందరర్శించారు. గతంలో దక్షిణ ప్రాంగణం ప్రిన్సిపాల్ సుధాకార్ గౌడ్ యూనివర్సిటీ వసతి గృహంలో ఉన్న సమస్యలను వీసీ దృష్టికి తీసుకెళ్లగా మంగళవారం వసతి గృహాలను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీసీ వెంట యూనివర్సిటీ ఏఈ వినోద్, ప్రిన్సిపాల్ సుధాకర్ గౌడ్, బాలురు, బాలికల హాస్టల్ వార్డెన్లు డాక్టర్ యాలాద్రి, సునీత, మోహన్‌బాబు, నాగరాజు, నారాయణ, రమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న గంప గోవర్ధన్

మాచారెడ్డి, మార్చి 11 : మండలంలోని అంకిరెడ్డిపల్లి తండాకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మేస్త్రీ రాములు రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ మంగళవారం తండాకు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బాల్‌చంద్రం, భూక్యా నర్సింహులు, హంజీ నాయక్, కృష్ణారెడ్డి, భూక్యా భాస్కర్, హేమ్లానాయక్, అబ్దుల్‌ఖాన్, భాస్కర్, మల్లేశ్ ఉన్నారు.

కడుపునొప్పి భరించలేక విద్యార్థి ఆత్మహత్య

కామారెడ్డి రూరల్, మార్చి 11 : మండలంలోని గర్గుల్ గ్రామంలో కడుపునొప్పి భరించలేక విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడని దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గర్గుల్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శరత్ పదో తరగతి చదువుతున్నాడు. చాలా రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. దవాఖానల్లో చూపించినా నయం కాలేదు. మంగళవారం ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కొడుకు చావుపై తమకు ఎవరిపైనా అనుమానం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

17న వాహనాల వేలం

కామారెడ్డి, మార్చి 11 : కామారెడ్డి జిల్లా ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 17వ తేదీన ఎక్సైజ్ స్టేషన్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ విజయ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 స్కూటర్లు, ఒక ఆటో, ఒక మారుతి కారును వేలం వేస్తున్నట్లు తెలిపారు. వాహనాలకు 18 శాతం జీఎస్‌టీ కూడా ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ముందుగా రూ.5 వేలు డిపాజిట్ చేసి తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు ప్రవేశపెట్టాలి

కామారెడ్డి, మార్చి 11 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులను ప్రవేశపెట్టాలని కోరుతూ విద్యార్థి సేన ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యల ను దృష్టిలో పెట్టుకొని వెంటనే కోర్సులను ప్రవేశపెట్టాలని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సేన జిల్లా అధ్యక్షుడు వినయ్‌కుమార్, నాయకులు పవన్, సురేశ్, ప్రసాద్, రిషబ్, వంశీ పాల్గొన్నారు.

గోశాలకు ఎడ్ల తరలింపు

మాచారెడ్డి, మార్చి 11 : రాజన్నసిరిసిల్ల నుంచి మెదక్ జిల్లాలోని నార్సింగ్‌కు తరలిస్తున్న ఐదు ఎడ్లను రామారెడ్డి మండలంలోని మద్దికుంట గోశాలకు తరలించారు. ఒకే ట్రాలీలో నిబంధనలు పాటించకుండా ఎడ్లను తీసుకెళ్తుండగా పాల్వంచ మండలం ఏల్పుగొండ శివారులో స్థానికులు అడ్డుకొని పోలీసులకు సమాచారం అందించారు. వాటిని మద్దికుంటలో ఉన్న గోశాలకు గ్రామస్తుల సమక్షంలో తరలించారు.

యువకుడి రిమాండ్

బీబీపేట్(దోమకొండ), మార్చి 11 : యువతిని మోసం చేసిన ఓ యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రవంతి మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. దోమకొండకు చెందిన ఓ యువకుడు ప్రేమించి పెండ్లి చేసుకున్నాడు. వారం రోజుల తర్వాత ఆ యువకుడు పెండ్లి చేసుకున్న యువతిని వద్దన్నాడు. దీంతో యువతిని మోసం చేసిన యువకుడిని సోమవారం రాత్రి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

కామారెడ్డి, మార్చి 11 : జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం మొదటి సంవత్సరం పరీక్షలు నిర్వహించారు. మొత్తం 38 సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు. మ్యాథమెటిక్స్, బోటనీ, జువాలజీ పేపర్-1కు మొత్తం జనరల్ 8,624 మంది కిగాను 8,378 మంది హాజరుకాగా 246 మంది గైర్హాజరయ్యారని ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు. ఒకేషనల్ 2,096 మందికిగాను 1,943 మంది హాజరుకాగా 153 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేత

బాన్సువాడ, మార్చి 11 : బాన్సువాడ నియోజకవర్గంలోని చందూర్, వర్ని, కోటగిరి మండలాల్లోని 82 మందికి కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి బాన్సువాడలోని ఆయన స్వగృహంలో మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగాధర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులరైజేషన్ ప్రొసీడింగ్ పొందాలి

బాన్సువాడ, మార్చి 11 : ఎల్ఆర్ఎస్ 2020లో రూ.వెయ్యి చెల్లించి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఈ నెల 31లోగా డబ్బులు చెల్లించి ప్లాట్ల లే అవుట్ రెగ్యులరైజేషన్ ప్రొసీడింగ్ పొందాలని మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లేని పక్షంలో ప్లాట్లను అక్రమ లే అవుట్ల కింద నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

బాన్సువాడ డీఎల్పీవోగా సత్యనారాయణరెడ్డి

బాన్సువాడ రూరల్, మార్చి 11 : బాన్సువాడ డివిజనల్ స్థాయి పంచాయతీ అధికారిగా సత్యనారాయణ రెడ్డి మంగళవారం విధుల్లో చేరారు. బాన్సువాడ ఎంపీవోగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు డీఎల్‌పీవోగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఉత్తర్వులు జారీ చేశారు.

సైబర్ నేరాలపై అవగాహన

కామారెడ్డి, మార్చి 11 : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని అడ్లూర్‌లో మంగళవారం పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు షీటీం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాగాళ్లపై 8712686094, 1930, 108, 100, 181 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. పోలీసుల కళాబృందం, ప్రధానోపాధ్యాయురాలు సుమలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

యువకుడిపై పోక్సో కేసు నమోదు

నాగిరెడ్డిపేట, మార్చి11: మండలానికి చెందిన బాలికను మాయ మాటలు చెప్పి మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురిచేసిన లింగంపల్లికలాన్ గ్రామానికి చెందిన బుచ్చమ్మల ఉదయ్‌కుమార్‌ను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రవీందర్‌నాయక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని ఒక గ్రామానికి చెందిన బాలిక ఈనెల 3 నుంచి అదృశ్యమవగా కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఎస్సై మల్లారెడ్డి విచారణ చేపట్టి మండలంలోని లింగంపల్లి కలాన్ గ్రామానికి చెందిన ఉదయ్‌కుమార్ బాలికతో ఏడాది కాలంగా ఇన్‌స్టాగ్రాంలో పరిచయం పెంచుకున్నట్లు తెలిసింది. మాయమాటలతో నమ్మించి, శారీరకంగా లోబర్చుకున్నట్లు గుర్తించారు. నిందితుడు తన నేరాన్ని ఒప్పుకోవడంతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు. ఆయన వెంట ఎస్సై మల్లారెడ్డి ఉన్నారు.

నాగన్న బావిని సందర్శించిన విద్యార్థులు

నాగన్న బావి వద్ద లింగంపేట శిశుమందిర్ పాఠశాల విద్యార్థులు

లింగంపేట, మార్చి11: మండల కేంద్రంలోని నాగన్న బావిని స్థానిక శిశుమందిర్ పాఠశాల విద్యార్థులు సందర్శించారు. విజ్ఞాన విహార యాత్రలో భాగంగా విద్యార్థులు మంగళవారం నాగన్న బావిని సందర్శించినట్లు పాఠశాల మాతాజీలు తెలిపారు. బావి చరిత్రను విద్యార్థులకు వివరించినట్లు చెప్పారు. పురాతన కట్టడాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి నాగన్న బావిని సందర్శించినట్లు వివరించారు. విహారయాత్రకు వెళ్లినవారిలో ఉపాధ్యాయులు రాజారాం, రంజిత్, సుమలత, లావణ్య, సునంద తదితరులు ఉన్నారు.

గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపాలి

• ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి

రికార్డులను పరిశీలిస్తున్న ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి

ఎల్లారెడ్డిరూరల్, మార్చి 11: గంజాయి రవాణాపై ఉక్కు పాదం మోపాలని ఎక్సైజ్‌శాఖ సిబ్బందికి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి సూచించారు. మంగళవారం ఎల్లారెడ్డి ఎక్సైజ్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. కార్యాలయ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. 2006 నుంచి ఇప్పటి వరకూ నమోదైన కేసులు, దస్త్రాలను తనిఖీ చేసి అన్నీ సక్రమంగా ఉండడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేసి మాట్లాడారు. మత్తుపదార్థాల రవాణా, గంజాయిపై ఉక్కుపాదం మోపాలని స్థానిక ఎక్సైజ్ సిబ్బందికి సూచించారు. గుడుంబా నిల్వలు లేకుండా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట స్థానిక ఎక్సైజ్ సీఐ ఎండీ షాకీర్ అహ్మద్, ఎస్సై జగన్‌మోహన్, హెడ్ కానిస్టేబుల్ పెంటయ్య, జూనియర్ అసిస్టెంట్లు జనార్దన్, ఆనంద్, సిబ్బంది ఉన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే దుకాణం సీజ్

రామారెడ్డి, మార్చి11: మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ హాజరై మాట్లాడారు. వరి పంట కీలక దశలో ఉన్నందున రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం మండలకేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే దుకాణాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

పెద్ద కొడప్‌గల్, మార్చి 11 : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనంతో పాటు మెరుగైన విద్యాబోధన అందించాలని మండల ప్రత్యేక అధికారి కిషన్ అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను ఆయన తహసీల్దార్ దశరథ్, ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రెడ్డితో కలిసి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంటలను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కూరగాయలు, స్టోర్ రూంను పరిశీలించి స్టాక్ రిజిష్టర్లు తనిఖీ చేసి అనంతరం మాట్లాడారు. అధికారులవెంట వైస్ ప్రిన్సిపాల్ నాగరాణి, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి..

లింగంపేట(తాడ్వాయి), మార్చి11: గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని జిల్లా సీపీవో, తాడ్వాయి మండల ప్రత్యేక అధికారి రాజారాం సూచించారు. తాడ్వాయి కస్తూర్బా బాలికల పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో తదితరులు ఉన్నారు.

విద్యార్థులతో భోజనం చేసిన ప్రత్యేకాధికారి ప్రమీల..

నిజాంసాగర్, మార్చి 11 : జిల్లా వెల్ఫేర్ అధికారి అయిన ప్రమీల మండల నూతన ప్రత్యేకాధికారిగా మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆమె కేజీబీవీ, అచ్చంపేటలోని ఎస్సీ సోషల్ వెల్ఫేర్ పాఠశాలను సందర్శించారు. కేజీబీవీలో రికార్డులు తనిఖీ చేసి, ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆమెవెంట ఎంపీడీవో గంగాధర్, ఏపీవో శివకుమార్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, నీళ్ల బాటిళ్లు అందజేస్తున్న నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకర్

తాడ్వాయి కస్తూర్బా పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా సీపీవో రాజారాం

విద్యార్థులకు ప్యాడ్లు, నీళ్ల బాటిళ్ల పంపిణీ ..

నాగిరెడ్డిపేట, మార్చి11: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహంలోని విద్యార్థులకు మంగళవారం రాత్రి పరీక్ష ప్యాడ్లు, నీళ్ల బాటిళ్లను మంగళవారం ఎంపీడీవో ప్రభాకర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకొని పరీక్షల్లో మంచి ఫలితాలను సాధించాలని సూచించారు. 84 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, నీళ్ల బాటిళ్లు ప్రభుత్వం అందించినట్లు వార్డెన్ రాములు తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఎంపీడీవో భోజనం చేశారు. కార్యక్రమంలో గోపాల్‌పేట గ్రామకార్యదర్శి కిష్టయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు

చికిత్స పొందుతున్న అరవింద్

పెద్ద కొడప్‌గల్ (పిట్లం),మార్చి 11: పిట్లం మండల కేంద్రానికి చెందిన మిర్యాల చిరంజీవి కొడుకు అరవింద్ (12). చిన్న వయస్సులోనే అతడికి రెండు కిడ్నీలు చెడిపోవడంతో ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఇంజక్షన్, మందుల కోసం ఇప్పటి వరకూ రూ.2.5 లక్షలు ఖర్చు చేశారు. అయినా ఆరోగ్యం కుదుటపడలేదు. వైద్యం కోసం డబ్బులు చాలా అవసరమని డాక్టర్లు చెబుతున్నారు. వీరిది నిరుపేద కుటుంబం. రోజూ కూలి పనిచేస్తే గాని పూట గడవని పరిస్థితి. ఇప్పటి వరకూ అప్పు తెచ్చి వైద్యం చేయించారు. తమ కొడుకు ప్రాణాలు కాపాడుకునేందుకు వైద్యం చేయించే స్థోమత తమకు లేదని, తాము దీనస్థితిలో ఉన్నామని, ఎవరైనా దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం చేసి తమ కొడుకు ప్రాణాలు కాపాడాలని అరవింద్ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఎవరైనా సహాయం చేయాలనుకొనేవారు ఫోన్ పే నంబర్ 9550657480, బ్యాంక్ అకౌంట్ నంబర్ 33171422354, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ 0012969 ఎస్‌బీఐ బ్యాంక్ పిట్లం బ్రాంచ్‌లో డిపాజిట్ చేయాలని కోరుతున్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్లు సీజ్

నిజాంసాగర్, మార్చి 11 : మండలంలోని అచ్చంపేట గ్రామంలో మంగళవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. అచ్చంపేట గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండగా పట్టుకుని, నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వాహనాల తనిఖీ

పెద్దకొడప్‌గల్, మార్చి 11: మండలంలోని అంజని చౌరస్తా సమీపంలో జాతీయ రహదారి నంబర్ 161 పై మంగళవారం ఎస్సై మహేందర్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు పాత చలాన్లు వెంటనే చెల్లించాలన్నారు. వాహనాల ధ్రువ పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సాయిశివ, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

నాగిరెడ్డిపేట, మార్చి11: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పనులను మంగళవారం ఎంపీడీవో ప్రభాకర్ పరిశీలించారు. మస్టర్లను తనిఖీ చేశారు. పనుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పనులు నిబంధనల ప్రకారం సకాలంలోపూర్తి చేసుకోవాలని కూలీలకు సూచించారు.

ఫార్మేషన్ రోడ్డు పనుల పరిశీలన

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 11: మండలంలోని భిక్నూర్ గ్రామంలో ఉపాధి పనులను మంగళవారం ఎంపీడీవో ప్రకాశ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడుతూ ఉదయాన్నే ఎండలు రాక ముందే పనులను ముగించుకోవాలన్నారు. ఈ నెలాఖరు వరకు వంద రోజుల పని కోటాను పూర్తిచేసుకోవాలని సూచించారు. అక్కడ కొనసాగుతున్న ఫార్మేషన్ రోడ్డు పనులను పరిశీలించారు.

రేపటి నుంచి ఉపాధి హామీ సామాజిక తనిఖీ..

గాంధారి, మార్చి 11: ఉపాధి హామీ 15వ విడుత సామాజిక తనిఖీ, ప్రజావేదికను ఈ నెల 13న మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆడపిల్లలు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి